సాక్షి
చిత్తూరు
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



లారీ ఢీకొని మహిళ మృతి

బంగారుపాళెం మండలంలోని మొగిలిఘాట్‌లో లారీ ఢీకొని మహిళ మృతిచెందింది. - 8లో



సంకల్పం.. 'శోభా'యమానం

తెలుగు భాష, సాహిత్య రంగానికి శోభారాజు విశేష సేవలు అందిస్తున్నారు. దీంతో ఆమెను అనేక అవార్డులు వరించాయి. - 8లో



రేబిస్ వ్యాధి నిర్మూలనే ధ్యేయం

చిత్తూరు జిల్లాలో రేబిస్ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు పశుసంవర్థక శాఖ జిల్లా డెప్యూటీ డైరెక్టర తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఐటీఐ కళాశాలలో ఉచిత కోర్సులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మూడు నెలల ఉచిత శిక్షణా కోర్సులు ప్రారంభిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. చిత్తూరులోని ఎస్టేట్ వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ఉచితంగా పలు కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీటికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల మండలాల నుంచి విద్యార్థులు వచ్చేందుకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సు పాసు సౌకర్యం ఉంటుందన్నారు. సోలార్ ప్యానల్ ఇన్‌స్టలేషన్ టెక్నీషియన్ (విద్యార్హత : పదో తరగతి), బ్రిక్ మెషిన్ (8వ తరగతి), ఎలక్ట్రీషియన్ టెక్నీషియన్ (పదో తరగతి), ఫీల్డ్ టెక్నీషియన్ (యూపీఎస్, ఇన్వర్టర్) కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అక్టోబర్ 7వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు 7396631623, 9764762155, 8008726067లో సంప్రదించాలన్నారు.

జిల్లా జైలులో భద్రతపై ఎస్పీ సమీక్ష



ఖైదీలతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా జైలులో భద్రతపై ఎస్పీ మణికంఠ శనివారం సమీక్షించారు. ఆయన శనివారం జైలు పర్యవేక్షణాధికారి వేణుగోపాల్‌రెడ్డితో కలిసి జైలును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, రాత్రి వేళల్లో గస్తీ, జైలు వ్యవస్థను పటిష్టపరిచే అంశాలపై చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జైలు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడానికి నైతిక పరిరక్షణ అవసరమన్నారు. అనంతరం ఖైదీల మానసిక పరిస్థితి, ఆరోగ్యం, పునరావాసం తదితర విషయాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. జైలులో ఖైదీల హక్కులను తెలియచేశారు. వారికి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జైలర్లు శంకరరావు, అప్పలనారాయణ, కుమారస్వామి పాల్గొన్నారు.

నేడూ కరెంటు బిల్లుల చెల్లింపు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని బిల్లుల వసూలు కేంద్రాల్లో ఆదివారం కూడా చెల్లింపులు చేయవచ్చని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆదివారం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ కరెంటు బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేస్తాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే హెచ్‌టీ సర్వీసుదారులు పెండింగ్ బిల్లు చెల్లించకపోతే సోమవారం విద్యుత్ సరఫరా ఆపివేస్తామని హెచ్చరించారు.

రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం రూ.5.64 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మేరకు ఆర్అండ్‌బీ పరిధిలోని రోడ్లకు ప్యాచ్ వర్క్స్ చేస్తామని అధికారులు తెలిపారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు చేయనున్నట్టు వెల్లడించారు.

టెట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీచేసిన షెడ్యూల్ ప్రకారం టెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. అక్టోబర్ 13 నుంచి 21వ తేదీ వరకు టెట్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలుంటే గ్రీవెన్స్ సెల్ 9032185001లో సంప్రదించాలని వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 64,158 మంది స్వామిని దర్శించుకోగా 24,938 మంది తలనీలాలు సమర్పించారు. భక్తులు స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.31 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించబోరని పేర్కొంది.

బాబుకు సద్బుద్ధినివ్వు



చిత్తూరు: కట్టమంచి వరదరాజులు స్వామి ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న విజయానందరెడ్డి



తిరుమలలో స్వామి వారి దర్శనం చేసుకుని వెలుపలికి వస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్

సూపర్ సిక్స్ పథకాల అమలులో చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. వంద రోజుల పరిపాలనలో ఒక్కటంటే ఒక్క పథకాన్నీ అమలుచేయలేదు. ప్రజలు నిలదీస్తారనే ఉద్దేశంతో వారిని తప్పుదోవ పట్టించాలనుకున్నారు. ఇందులో భాగంగా తిరుమల శ్రీవారి లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారు. లడ్డూకు వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని చెబుతూ తమ క్షుద్ర రాజకీయాలకు దేవదేవుడైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని వాడుకున్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ పాపపు వ్యాఖ్యలు ఆంధ్ర రాష్ట్రానికి తగలకూడదని, వారికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో పూజలు చేశాయి. లడ్డూపై తప్పుడు ప్రచారం చేస్తున్న పాపాత్ములను శిక్షించాలని ప్రార్థించాయి.

- తిరుమల లడ్డూపై కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం..
- లడ్డూ పవిత్రతను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహారం
- జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో వైఎస్సార్ సీపీ పూజలు

కాణిపాకం: కూటమి ప్రభుత్వం క్షుద్ర రాజకీయాలకు తిరుమలేశుని వాడుకోవడం దారుణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినదించారు. తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రతను, స్వామివారి లడ్డూ ప్రసాదం విశిష్టతను, స్వామి వైభవంతో పాటు టీటీడీ పేరు ప్రఖ్యాతులను చెడగొట్టేలా అసత్య ప్రచారం చేయడం తగదని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా శనివారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

- తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్న నారా చంద్రబాబునాయుడుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని, లడ్డూ ప్రసాదంపై విష ప్రచారం చేస్తున్న కూటమి నేతలకు కనువిప్పు కలిగించాలని శ్రీ వెంకటేశ్వరస్వామిని ఎమ్మెల్సీ భరత్, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రార్థించారు. వారు శనివారం తిరుమలేశుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుప్పంలోని కౌన్సిలర్లు, ప్రతి మండల కేంద్రంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆలయాల్లో పూజలు చేశారు. చేతుల్లో కర్పూరం అంటించుకుని హారతిపట్టారు.
- పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు సమష్టిగా ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్ పండ్లు, పూజాసామగ్రి తీసుకెళ్లి బంగారుపాళ్యం మండలం మొగిలిలోని వెంకటగిరి రాములగుడిలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి లడ్డూపై చంద్రబాబు చేస్తున్న నీచ రాజకీయాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటీనగరం, వెదురుకుప్పంలోని ద్రౌపదమ్మ ఆలయాలు, పెనుమూరులోని కలిగిరి శ్రీవెంకటేశ్వరస్వామి, పాలసముద్రంలోని బాలగురునాథేశ్వరస్వామి, శ్రీరంగరాజుపురంలోని ఆరిమాను గంగమ్మ, గంగాధరనెల్లూరులోని అల్లియల్లమ్మ ఆలయాల్లో ఆయా మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబు బుద్ధిలో మార్పు రావాలని పొర్లు దండాలు పెట్టారు.
- నగరి నియోజకవర్గంలోని బుగ్గ అగ్రహారంలో ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో నాయకులు పూజలు చేశారు. అలాగే నింద్రలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పాలాభిషేకం చేయించారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని, పాపాత్ములకు శిక్షించాలని ప్రార్థించారు.

అంజేరమ్మా.. పాప ప్రక్షాళన చెయ్యమ్మా

– మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి



అంజేరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, కృపాలక్ష్మి

పుత్తూరు: చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తమ రాజకీయాల కోసం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని వాడుకుంటున్నారని, వారి పాపాలను ప్రక్షాళన చేయాలని మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మీ వడమాలపేటలోని అంజేరమ్మను ప్రార్థించారు. వారు శనివారం అంజేరమ్మ కనుమ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నారాయణస్వామి మాట్లాడుతూ కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవేంకట్వేరస్వామి ప్రసాదంపై తప్పుడు ఆరోపణలు చేసిన చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించి, పాప ప్రక్షాళన చేయాలని అంజేరమ్మను ప్రార్థించినట్లు తెలిపారు. చంద్రబాబు బుద్ధి తెచ్చుకొని దేవుని ప్రసాదంతో రాజకీయాలు చేయడం మానుకోవలని హితవుపలికారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే శ్రీవారి దర్శనం చేసుకోకుండా అడ్డుకున్నారని, ఈ ప్రభుత్వంలో ఇక దళితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే దళితులను పలు గ్రామాల్లోని ఆలయాల్లోకి అనుమతించడం లేదని ఆరోపించారు. చంద్రబాబు చర్యల వల్ల కుల, మతోన్మాదులు మరింతగా రెచ్చిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. నీచ రాజకీయాలు చేస్తున్న చంద్రబాబుకు రానున్న కాలంలో ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని తెలిపారు.

చిత్తూరు నియోజకవర్గంలో

- వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంసీ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు నగరం కట్టమంచిలోని శ్రీవరదరాజులుస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆయన ఉపవాస దీక్ష చేపట్టి తొలుత ఆలయ ప్రదిక్షణ చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆలయ ధ్వజ స్తంభం ఎదుట పూజా కైంకర్యాలు చేశారు. తిరుమల కొండపై చంద్రబాబు చేస్తున్న పాపాలను కడిగిపెట్టాలని కొబ్బరికాయలు కొట్టి ముక్కంటిని ప్రార్థించారు. గోవింద నామస్మరణలతో కార్యక్రమాన్ని ముగించారు. అనంతరం ప్రసాదం పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పలమనేరు నియోజకవర్గంలో

- పలమనేరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ప్రధానంగా పలమనేరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం భగవంతుని పేరు చెప్పి చేస్తున్న పాపాలను ప్రక్షాళన చేయాలని కొబ్బరికాయలు కొట్టారు.

పూతలపట్టు నియోజకవర్గంలో

- పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు సమష్టిగా ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్ పండ్లు, పూజాసామగ్రి తీసుకెళ్లి బంగారుపాళ్యం మండలం మొగిలిలోని వెంకటగిరి రాములగుడిలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి లడ్డూపై చంద్రబాబు చేస్తున్న నీచ రాజకీయాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



బంగారుపాళెం: మొగిలి వెంకటగిరి శ్రీకోదండరామస్వామి ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నేతలు

పుంగనూరు నియోజకవర్గంలో

- పుంగనూరు నియోజకవర్గం సదుంలోని శ్రీవారిపాద క్షేత్రంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో పూజలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని స్వామిని ప్రార్థించారు.



సదుం: పూజల్లో పాల్గొన్న పెద్దిరెడ్డి

ప్రసన్న వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం

- శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ట
- కనువిందుగా శ్రీవారి స్నపన తిరుమంజనం



స్వామి, అమ్మవార్ల స్నపన తిరుమంజనం

పుత్తూరు: వడమాలపేట మండలం అప్పలాయగుంటలో ఉన్న టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున సుప్రభాతంతో శ్రీవారిని మేల్కొలిపి శుద్ధి, తోమాల సేవ, అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు. తదుపరి శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ట చేశారు. పద్మావతి, ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వస్వామికి స్నపన తిరుమంజనాన్ని వేదోక్తంగా చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవాన్ని నయనానందకరంగా నిర్వహించారు. భక్తులు నారికేల కర్పూర నీరాజనాలు సమర్పించి స్వామిని దర్శించుకున్నారు. రాత్రి యాగశాలలో హోమం, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ పర్యవేక్షించారు.

పవిత్రోత్సవాల్లో నేడు

పవిత్రోత్సవాల్లో రెండవ రోజైన ఆదివారం ఉదయం 9.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. 11.30 గంటల నుంచి 12.30 మధ్య స్వామి, అమ్మవార్లకు పవిత్రాలు సమర్పిస్తారు.

డ్రిప్ పరికరాలపై అవగాహన



పంటలను తనిఖీచేస్తున్న మురళీకృష్ణ

గుడిపాల: రైతులకు డ్రిప్ పరికరాలపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ అన్నారు. ఆయన శనివారం అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ డ్రిప్ పరికరాలతో నీటిని ఆదా చేసుకోవచ్చని పేర్కొన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించి వారి ద్వారా డ్రిప్‌లను ఏర్పాటుచేసే విధంగా చూడాలని సూచించారు. అనంతరం ఈ పంట నమోదులో భాగంగా ఈ క్రాప్ చేసిన రైతుల పొలాలను పరిశీలించారు. రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయధికారి మాధవి పాల్గొన్నారు.

అబద్ధం చెప్పి దబాయిస్తే నిజమవ్వదు

- ప్రశాంత వాతావరణం లేదు కనుకే జగనన్న పర్యటన రద్దు
- భయం ఆయన బ్లడ్‌లోనే లేదు
- కుల, మత రాజకీయాలకు తెరతీసిన కూటమి
- తిరుమల శ్రీవారినీ రాజకీయాలకు వాడుకోవడం దారుణం
- వారికి భగవంతుడే సమాధానం చెబుతాడు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా



నగరి: అబద్ధాలు చెప్పేసి దాన్ని నిజం చెయ్యాలని చంద్రబాబు నాయుడు అనుకుంటే అది ఆయన భ్రమేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కేరోజా తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటన రద్దు కావడంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై ఆమె శనివారం స్పందించారు. డిక్లరేషన్‌కు భయపడే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటన రద్దు చేసుకున్నారని చంద్రబాబు అండ్ కో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఆయనే శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారని, వైఎస్సార్ ఐదేళ్లు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారని గుర్తు చేశారు. నేడు ఆయనేదో తొలిసారి తిరుమలకు వస్తున్నట్లు డిక్లరేషన్ కోరడం మత రాజకీయాల్లో భాగమేనని దుయ్యబట్టారు. స్వామిని దర్శించుకునేందుకు వస్తే మత విద్వేషాలు రగిల్చి అలజడి సృష్టించాలని కూటమి పార్టీలు ప్రయత్నించాయని ఆరోపించారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ నేతలకు నోటీసులు ఇవ్వడంతోపాటు జగన్‌మోహన్ రెడ్డిని కలవడానికి వెళితే అరెస్టు చేస్తామని బెదిరించారని వివరించారు. వారి కుయుక్తులకు ప్రజలు ఇబ్బంది పడకూడదనే జగనన్న తిరుమల పర్యటన రద్దు చేసుకున్నారని చెప్పారు. మానవత్వం తన మతం అని చాటుకున్నారని పేర్కొన్నారు. అంతేగానీ భయం అన్నది ఆయన బ్లడ్‌లోనే లేదన్నారు. వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి దమ్ము, ధైర్యం గురించి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. దేవుడంటే చంద్రబాబుకు భయం లేదు కనుకే ఆయనను కూడా రాజకీయాల్లో పావుగా వాడుకుంటున్నారని తెలిపారు. ఆయనకు భగవంతుడే గట్టిగా సమాధానం చెబుతాడన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా అగ్నిమాపక అసోసియేషన్ కార్యవర్గం

చిత్తూరు కలెక్టరేట్ : అగ్నిమాపక సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని ఉమ్మడి చిత్తూరు జిల్లా అగ్నిమాపక శాఖ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్ తెలిపారు. జిల్లా కేంద్రమైన చిత్తూరులోని రెవెన్యూ భవనంలో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అగ్నిమాపక శాఖ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరెడ్డి వ్యవహరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా నరేష్, ఉపాధ్యక్షునిగా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్, ట్రెజరర్‌గా రాజశేఖర్, అడ్వైజర్‌గా రెడ్డెప్పరెడ్డి ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ సంఘం నియమ, నిబంధనలను పాటిస్తూ సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. నూతన కమిటీ సభ్యులను జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి అభినందించారు.

వారంలోపు మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణ చర్యలు

- డేంజర్ జోన్ హోర్డింగులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయండి
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : వారంలోపు మొగిలి ఘాట్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం జాతీయ రహదారులు, రవాణా శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మొగిలి ఘాట్ రోడ్డులో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. వాటి నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. చెక్ పోస్టును ఏర్పాటు చేసి అంబులెన్స్, క్రేన్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. మొగిలి ఘాట్ రోడ్డును డేంజర్ జోన్‌గా పేర్కొంటూ 200 మీటర్లకు ఒక చోట పెద్ద హోర్డింగ్ పెట్టాలని సూచించారు. పట్రోలింగ్ వాహనాన్ని అందుబాటులో పెట్టాలన్నారు. బారికేడింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని, సైన్ బోర్డులు పెట్టాలని పేర్కొన్నారు. థర్మాప్లాస్టిక్, డ్రమ్స్ స్టిక్కర్స్, బీటీ రంబిక్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించేలా జాతీయ రహదారుల వద్ద అంబులెన్స్‌లను ఉంచాలని తెలిపారు. అతివేగం నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో తిరుపతి ఎస్‌హెచ్ పీడీ వెంకటేశ్వర్లు, డీటీసీ నిరంజన్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దపంజాణి: మండలంలోని నిడిగుంటలో ఒకరిని అరెస్టు చేసి 96 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సహదేవి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని నిడిగుంటకు చెందిన మునిరత్నం కుమారుడు సుబ్రమణ్యం(40) గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. దీంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు పేర్కొన్నారు. అతన్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.1.70 లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కో వ్యక్తికి రూ.పది వేల చొప్పున.. 17 మందికి రూ.1.70 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పు చెప్పారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 17 మందిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.1.70 లక్షల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

రేబిస్ వ్యాధి నిర్మూలనే ధ్యేయం

గుడిపాల: రేబిస్ వ్యాధి నిర్మూలనే ధ్యేయమని చిత్తూరు పశుసంవర్ధకశాఖ డెప్యూటీ డైరెక్టర్ అబ్దుల్‌ఆరీఫ్ తెలిపారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా బొమ్మసముద్రం పశువైద్యశాలలో శనివారం పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ కుక్కలు కరవడం వల్ల పశువులు, మనుషులకు రేబిస్ వ్యాధి వస్తుందని తెలిపారు. 2030 నాటికి రేబిస్ వ్యాధి లేకుండా చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. పశువైద్య డాక్టర్లు సాయిసుధ, రవితేజ, సిబ్బంది అబ్దుల్లా, కిషోర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా ప్రసాద్

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్ వన్ ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్‌ఆర్‌వీ ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలే ఆయన్ని నెల్లూరు నుంచి తిరుపతికి బదిలీ చేసింది. అలాగే తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు ఇన్‌చార్జి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించాలని పేర్కొంది.

సంకల్పం.. శోభాయమానం


అదివో..అల్లదివో కార్యక్రమంలో శోభారాజు(ఫైల్)

- టీటీడీ అన్నమయ్య కీర్తనల్లో జడ్జిగా గుర్తింపు
- పృచ్ఛకురాలిగా... విభిన్న రంగాల్లో రాణింపు
- సాధారణ కుటుంబంలో అసాధారణ మహిళ
- బెస్ట్ ఉమెన్ అచీవర్ అవార్డు గ్రహీత శోభారాజు

ఆమె 72 ఏళ్ల వయస్సులోనూ తెలుగు భాష, సంగీత, సాహిత్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అవార్డులు, బిరుదులు వరించాయి. ఆమె శోభారాజు. చిత్తూరు జిల్లా నింద్ర మండలం మేళంబాకం గ్రామంలో ఓ సాధారణ రైల్వే ఉద్యోగి కుటుంబంలో జన్మించింది. చమర్తి సంజీవరాజు, పద్మావతి దంపతుల తొలి సంతానమే శోభారాజు. తండ్రి ఉద్యోగ రీత్యా చెన్నైలో స్థిరపడ్డారు. దీంతో ఆమె చదువు చెన్నైలోని కేటీసీటీ స్కూల్‌లో ప్రారంభమైంది. క్వీన్‌మేరీస్ కాలేజీలో బీఏ పూర్తి చేశారు. ఆపై తెలుగు భాషపై ఉన్న మక్కువతో ప్రెసిడెన్సీ కాలేజీలో ఎంఏ తెలుగు లిటరేచర్ చేశారు.

పుత్తూరు: శోభారాజు తండ్రి సంజీవరాజుకు తెలుగు భాషంటే మిక్కిలి ఇష్టం. తెలుగు మీద మక్కువతో తన కుమార్తె శోభారాజును తెలుగులో ఎంఏ చదివించారు. ఆమె కూడా తెలుగు భాషపై పట్టు సాధించారు. సంగీత, సాహిత్య వేదికలపై ఆమె చురుగ్గా పాల్గొంటున్నారు. కవులను, అవధానులను, తెలుగు భాషాప్రియులను ప్రోత్సహిస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీబీసీ నిర్వహిస్తున్న అదివో అల్లదివో కార్యక్రమంలో పలు మార్లు జడ్జిగా వ్యవహరించారు. సంగీత సాహితీ చంద్ర డాక్టర్ వి.బి.సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయధార కార్యక్రమాల్లో ఇరవైకి పైగా సందర్భాల్లో పృచ్ఛకురాలిగా ప్రశ్నలు సంధించారు.

సాయం జీవితంలో ఓ భాగం

పేద పిల్లలకు ఏటా స్కూల్, కాలేజీ ఫీజులు కట్టడం, అనాథ, వృద్ధాశ్రమాలకు అన్నదాన నిధిని అందివ్వడం, పేద కుటుంబాల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందించడం శోభారాజు జీవితంలో ఓ భాగం. తన సొంత గ్రామానికి చెందిన ఎందరికో ఉద్యోగావకాశాలు కల్పించారు. మరెందరికో తన సాఫ్ట్‌వేర్ కంపెనీ ద్వారా జీవనోపాధి కల్పిస్తున్నారు. పుత్తూరు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవన నిర్మాణానికి రూ.6 లక్షలు విరాళంగా అందజేశారు. తన సొంత నిధులతో పలు సంగీత గేయధార కార్యక్రమాలను నిర్వహించారు. ఈమె సేవలను గుర్తించిన ప్రపంచ తెలుగు సమాఖ్య, చెన్నై వారు ఈ ఏడాది మార్చి 16న నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఉత్తమ మహిళా సాధకులు (బెస్ట్ ఉమెన్ అచీవర్) అవార్డుతో సత్కరించారు. 2023 సెప్టెంబర్ 10న శ్రీకళా సుధ తెలుగు అసోసియేషన్, చెన్నై వారు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఉత్తమ సంగీత గేయధార పృచ్ఛకురాలిగా శోభారాజును సన్మానించారు. అదే ఏడాది కేటీసీటీ స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం వనితా కిశోరం బిరుదుతో సత్కరించింది. 2022లో ఉగాది పర్వదినాన క్వీన్‌మేరీస్ కాలేజీ వారు అభిజ్ఞ బిరుదును ప్రదానం చేశారు.

వ్యాపార ప్రస్థానం

శోభారాజు వ్యాపార రంగంలోనూ తనదైన ముద్ర వేశారు. 2002లో తన 50 ఏట చెన్నైలో ఐకాస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించారు. నేటికీ విజయవంతంగా నడిపిస్తున్నారు. కంపెనీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు నిర్మాణ రంగంలోనూ దూసుకుపోతున్నారు. కుట్లు, అల్లికలు, పెయింటింగ్ మొదలైన హస్త కళల్లోనూ ప్రావీణ్యం సంపాదించారు. జ్యువెలరీ డిజైనింగ్‌లోనూ ఆమె నిపుణురాలే. వీటితో పాటు పాక శాస్త్రంలోనూ ఆమెకు ఆమే సాటి.


గానకోకిల సుశీలమ్మతో పాటు సత్కారం పొందుతున్న శోభారాజు(ఫైల్)



ప్రపంచ తెలుగు సమాఖ్య వేదికపై అవార్డు అందుకొంటూ.. (ఫైల్)

ఉగ్గుపాలలో తెలుగును రంగరించండి

"ప్రతి తల్లి తన పిల్లలకు ఉగ్గు పాలతో తెలుగు భాషను రంగరించి పోయాలి. తల్లిదండ్రులు తమ ఆస్తులకే కాకుండా తమ తెలుగు భాషకు తమ బిడ్డలను వారసులుగా అందివ్వాలి. ఉన్నవారు లేనివారికి చేయూతనివ్వాలి. నేను చేస్తున్నది అదే. అందరూ చేస్తే సమాజం బాగుంటుంది. – శోభారాజు, డైరెక్టర్, ఐకాస్ టెక్నాలజీస్, చెన్నై

విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

– జాతీయ రహదారిపై దళితుల నిరసన


మృతి చెందిన పాడి ఆవు

కార్వేటినగరం: మండలంలోని కోట దళితవాడలో శనివారం విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతిచెందింది. అధికారుల నిర్లక్ష్యంతోనే ఆవు మృతిచెందిందని పేర్కొంటూ దళితులు జాతీయ రహదారిపై నిరసనకు దిగారు. కోట దళితవాడకు విద్యుత్‌ను సరఫరా చేసే నిమిత్తం చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు. చేతికి అందేంత ఎత్తులోనే ఉంది. దాని చుట్టూ ఫెన్సింగ్ కూడా లేదు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన సుశీలమ్మ పాడి ఆవు మేతకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్ గురైంది. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు జాతీయ రహదారిపై నిరసనకు దిగారు. వారికి సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం మద్దతు తెలిపారు. పుత్తూరు డీఈతో ఫోన్‌లో మాట్లాడారు. సుశీలమ్మకు జీవనాధారమైన ఆవు విలువ రూ.1.40 లక్షలు ఉంటుందని, ఆమెను ఆదుకోవాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎత్తు పెంచాలని, ఫెన్సింగ్ వేయాలని కోరారు. గ్రామంలో ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని సూచించారు. పుత్తూరు విద్యుత్ డీఈ సానుకూలంగా స్పందించడంతో నిరసన విరమించారు. పశువైద్యాధికారి హేమకుమార్ పాడి ఆవు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు.


పాడి ఆవు మృతితో కోట దళితవాడ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బాలబాలికల కరాటే జిల్లా జట్ల ఎంపిక


ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికలు

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల కరాటే జట్ల ఎంపిక పోటీలు శనివారం తిరుపతిలో నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 60 మంది బాలబాలికలు హాజరయ్యారు. బాలబాలికలకు వేర్వేరు బరువు విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనబరిచిన బాలుర విభాగంలో 11 మంది, బాలికల విభాగంలో ఏడుగురిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. జిల్లా జట్లకు ఎంపికైన బాలబాలికలు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. ఎంపికైన బాలబాలికలను కరాటే మాస్టర్లు రత్నాకర్, వెంకటేశ్వరులు, శివకృష్ణ, సురేష్, సదాశివ, కన్నయ్య, చంద్రశేఖర్, వెంకటసుజిత, భువనేశ్వర్, కుమార్, లోకేష్, కిరణ్, కోచ్‌లు అభినందించారు.

బాలుర విభాగంలో..

ఎం.సుభాష్, జి.ధనుష్, ఎస్.రెడ్డి హితేష్‌రెడ్డి, ఈ.నితేష్, టి.పార్థసారథి, ఎస్.నిఖిల్, ఎం.యోగీశ్వర్, పి.సాయి వెంకటశివ, ఎస్.ధీరజ్, పి.నాగూర్‌వల్లి, డి.రంజిత్‌కుమార్ ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో:

బాలికల విభాగంలో డి.రిజ్వాన, టి.మునిసరిత, బి.జాహ్నవి, ఎం.ధాత్రి, వి.భవ్యశ్రీ, బి.జెస్సిక్రిస్టిన, వి.రేవతి ఎంపికయ్యారు.

2న విశ్వంలో అవగాహన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్ : 2025–26 విద్యా సంవత్సరంలో మిలటరీ, సైనిక్ స్కూళ్ల ప్రవేశ పరీక్షలకు సంబంధించి తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూలులో అక్టోబరు 2వ తేదీ అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఆ మేరకు శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్, సైనిక్ స్కూల్ 6, 9వ తరగతిలో ప్రవేశాలకు జాతీయస్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న అవగాహన సదస్సుకు 5 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావచ్చన్నారు. ఆయా పరీక్షలకు సంబంధించి వివరాలు తెలుసుకోవడంతోపాటు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

- కారుతోపాటు నడిచివెళ్తున్న మహిళను ఢీకొన్న లారీ
- అనంతరం అదుపుతప్పి బోల్తా పడిన వైనం


మృతి చెందిన గుర్తుతెలియని మహిళ

బంగారుపాళెం : మండలంలోని మొగిలి ఘాట్‌లో ప్రమాదాలు ఆగడం లేదు. మొన్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో ఎనిమిది మంది మృతిచెందారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. ఆ సంఘటనను ఇంకా మరిచిపోలేదు. ఈ లోపే శనివారం ఒక లారీ కారును, నడిచివెళ్తున్న మహిళను ఢీకొంది. అనంతరం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి చెందగా, లారీ డ్రైవర్ గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు..

లారీ బెంగళూరు నుంచి వైజాగ్ వెళుతోంది. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్ వద్ద ముందు వెళ్తున్న కారును ఢీకొంది. తర్వాత నడుచుకుంటూ వెళ్తున్న మహిళను ఢీకొని అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. వైజాగ్‌కు చెందిన లారీ డ్రైవర్ నవీన్‌కుమార్ గాయపడ్డాడు. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ మల్లప్ప, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. గాయపడిన లారీ డ్రైవర్‌ను బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహిళ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతురాలు 5.5 ఎత్తు కలిగి 50–60 ఏళ్లలోపు ఉంటుందని, ఎరుపు రంగు ఉందని పోలీసులు తెలిపారు. మెడలో నల్లపూసల దండ ఉందని, నలుపు రంగు లైగ్‌ఇన్, బ్లూ రంగు టాప్ ధరించి ఉందని పేర్కొన్నారు. మృతురాలి చిరునామా తెలిసినవారు బంగారుపాళెం పోలీసులకు తెలపాలని కోరారు. రోడ్డుకు అడ్డంగా లారీ బోల్తా పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు క్రేన్ సాయంతో దాన్ని తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. మొగిలి ఘాట్‌లో జరుగుతున్న వరుస ప్రమాదాలతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.